క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



పొన్నూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె.సంజీవరావు అన్నారు. సోమవారం ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుజాత డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో సంజీవరావు మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో ఓటు హక్కు ఉన్న వారందరూ నిజాయతీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, టీపీఓ రఘురామ్, రమాదేవి, రాజేష్ పాల్గొన్నారు.

కత్తి పద్మారావుకు ఘన సన్మానం



పొన్నూరు: పట్టణంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో శేకూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో చుండూరు పోరాట వీరుడు కవి డాక్టర్ కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణకుమారిలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు రెబ్బా సీతయ్య మాట్లాడుతూ 1991లో చుండూరులో ప్రాణాలకు తెగించి పోరాటం చేసి దళిత హక్కులను సాధించిన వీరుడు కత్తి పద్మారావు అని కొనియాడారు. కష్టాలలో ఉన్న వారికి అన్నం పెట్టిన మహాతల్లి కత్తి స్వర్ణకుమారి అని వారి మేలును ఎన్నటికీ మరువలేమని అన్నారు. అనంతరం ఇరువురికి పట్టు వస్త్రాలు బహూకరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రీసెర్చ్ సెంటర్ కోఆర్డినేటర్ కనపర్తి అబ్రహం లింకన్, బి.సుధాకర్, మాతంగి, ఆశీర్వాదం, గమిడి అబ్రహం, రాజారావు, గుర్రం మాతాంగి, గేరా ప్రసన్నకుమారి, కట్టా సృజన, శుభ, ఉమ, సుమతి పాల్గొన్నారు.

శివలింగాకృతి ప్రతిమల పంపిణీ



గుంటూరు రూరల్: అమరావతి సమీపంలో తాళ్లాయపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న శివ క్షేత్రానికి జొన్నలగడ్డ గ్రామంనుంచి శివలింగాకృతి ప్రతిమను పంపిణీ చేశారు. సోమవారం శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో శివలింగాకృతి ప్రతిమను భారీ ఊరేగింపుగా పంపిణీ చేశామన్నారు. నూతనంగా తాళ్లాయపాలెంలో నిర్మించే శివక్షేత్రానికి అనేక ప్రాంతాల నుంచి 6 లక్షల 20 వేల శివలింగాకృతి ప్రతిమలను పంపిణీ చేయటం జరిగిందన్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం



గుంటూరు రూరల్: బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని అటువంటి వాటిని నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని క్రాఫ్ సంస్థ ప్రతినిధి పద్మజ తెలిపారు. సోమవారం పెద్దపలకలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల వ్యతిరేక కళాజాతాను నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలి



కాకుమాను: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శంకర్ బాబు అన్నారు. పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ జి.లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్ల ఏర్పాట్లలో అలసత్వం



వడ్లమూడి బాలకోటేశ్వరస్వామి దేవస్థానం

- కనిపించని పకడ్బందీ ఏర్పాట్లు
- షాపుల కేటాయింపులో పచ్చపాతం

చేబ్రోలు: మహాశివరాత్రికి తెనాలి ప్రాంతంలో క్వారీ తిరునాళ్ల ప్రసిద్ధి. జిల్లాలో కోటప్పకొండ తరువాత ఖ్యాతి గాంచిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్దకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారు. వందేళ్ల ఏళ్ల చరిత్ర కలిగిన దేవస్థానం వద్దకు వివిధ గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న చిన్న ప్రభలు దేవాలయానికి చేరుకుంటాయి. బుధవారం మహాశివరాత్రికి అన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రాజకీయ జెండాలు, నాయకుల ఫ్లెక్సీలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

భారీ విద్యుత్ ప్రభలతో..

శంభో శంకర... హర హర మహదేవా.. అంటూ ఉత్సాహంగా మహాశివరాత్రి సందర్భంగా క్వారీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానానికి బయలు దేరిన బారీ విద్యుత్ ప్రభల్లో ఇప్పటి వరకు జరిగిన తిరునాళ్ల వేడుకలలో ప్రమాద ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏడేళ్లలో చేబ్రోలు మండలంలోని నారాకోడూరు తెనాలి రోడ్డులోని భారీ ప్రభ, గుండవరం, గొడవర్రు గ్రామ ప్రభలు విరిగి ప్రమాదానికి గురయ్యాయి. నారాకోడూరులోని శివాలయం ఎదురు ప్రభ ప్రమాదానికి గురైంది. లక్షల వ్యయంతో భారీ సెట్టింగ్‌లతో నిర్మిస్తున్న విద్యుత్ ప్రభలు, బరువు ఎక్కువ కావటంతో కూలిపోతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది జరగబోయే క్వారీ మహాశివ రాత్రి తిరునాళ్లకు పూర్తి స్థాయిలో తగిన ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

వీఐపీ దర్శనాల పేరుతో..

క్వారీ తిరునాళ్ల సందర్భంగా ఆలయం వద్ద వీఐపీ దర్శనాల పేరుతో ప్రత్యేక దర్శనానికి వెళ్లేవారికి దేవదాయశాఖ, పోలీసు శాఖలు ఇస్తున్న అనుమతులపై ప్రతి ఏటా విమర్శలు వస్తున్నాయి. సామాన్య భక్తులు, దర్శన టికెట్టు తీసుకొన్న భక్తులను గంటల కొద్దీ క్యూలైన్లలో వేచి ఉండాల్సి వస్తుంది.



నారాకోడూరులో ఇంటిమీద కుప్పకూలి పోయిన భారీ విద్యుత్ ప్రభ (ఫైల్)

షాపుల కేటాయింపులో...

క్వారీ తిరునాళ్ల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో వ్యాపారం చేసుకొనే వారికి షాపుల కేటాయింపులో పచ్చపాతం వహించటంపై చిరు వ్యాపారులు విమర్శిస్తున్నారు. గతంలో అనుసరిస్తున్న విధానాలకు భిన్నంగా తమకు అనుకూలమైన వారికి, ఎక్కువ డబ్బులు ఇచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వటంపై పలు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో పంచాయతీ, దేవదాయశాఖలకు ఆదాయ వనరులు వచ్చే వాటికి ముందుగా వేలం పాటల ప్రకటనలను వ్యాపారులకు, మీడియా ద్వారా తెలియపరిచేవారు. ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా తమకు అనుకూలమైన వారికి మాత్రమే సమచారం ఇచ్చి తూతూ మంత్రంగా కేటాయింపులు చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

పదిలో కష్టపడితే భవిష్యత్ బంగారం

బోడిపాలెం(కాకుమాను): పది పరీక్షల్లో ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని పదిలో కష్టపడి చదివితే భవిష్యత్ బంగారమవుతుందని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పది పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ మాట్లాడుతూ విద్యార్థి దశకు పదో తరగతి పునాది అని అలాంటి కష్టమైన పరీక్షలను విద్యార్థులు ధీటుగా ఎదుర్కొని కష్టపడి చదవాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. పాఠశాల వార్షికోత్సవాన్ని పూర్వ విద్యార్థులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. గత ఏడాది పది పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.



పది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులను అందజేస్తున్న ఎంఈఓలు కెనడీ, విజయ్ భాస్కర్

జాతీయ స్థాయి ప్రకృతి వ్యవసాయ సదస్సులో ప్రశంసలు

గుంటూరు రూరల్: ప్రకతి వ్యవసాయంలో రాష్ట్రానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు అనుసరిస్తున్న 7 మంది రైతులు ఉత్తమ ప్రకతి వ్యవసాయ రైతు అవార్డులు గెలుచుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రకటించిన 15 అవార్డులకుగాను 7 అవార్డులను రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయ రైతులకు దక్కడం విశేషం. ఫిబ్రవరి 23, 24 తేదీలలో నాగ్‌పూర్ వనమతి క్యాంపస్‌లో జిహెచ్ రైసోని వ్యవసాయ విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో నాగ్‌పూర్‌లో రెండు రోజుల పాటు సేంద్రియ వ్యవసాయంపై జాతీయ సదస్సు జరిగింది. జాతీయ సేంద్రీయ ప్రకృతి వ్యవసాయ కేంద్రం (ఎన్‌సీఓఎన్ఎఫ్), భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ఆదివారం సాయంత్రం అవార్డులను ప్రకటించారు. రాష్ట్రానికి చెందిన ఎం.నాగేంద్ర (అనంతపురం), కురుమునెల్లి శ్రీనివాస్(విజయనగరం), ఆర్ రజిని(సత్యసాయి), మండలపు సత్యనారాయణ (తిరుపతి), గెడ్డాడ అశ్వని (కొనసీమ), గొంగిముక్కల వెలుగొండయ్య (ప్రకాశం), చాకలి పుల్లయ్య (కర్నూలు)లు అవార్డులు దక్కించుకున్నారు.



నాగపూర్ సదస్సులో అవార్డులు అందుకుంటున్న రైతులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కాకుమాను: ప్రతి రోజు యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరూ రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని నోడల్ అధికారిణి శ్రీవాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ రోజు మనం తినే ఆహారం వలన విచిత్రమైన వ్యాధులు వస్తున్నాయని ఆహార విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా చిన్నారుల విషయంలో తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆహార నియమాలతో పాటు ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించి యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్,ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత,కాకుమాను సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారిణి శ్రీవాణి

స్వయం ఉపాధికి వ్యవసాయ అనుబంధ రంగాలే సరైన మార్గం

గుంటూరు రూరల్: స్వయం ఉపాదికి వ్యవసాయ అనుభంద రంగాలు సరైన మార్గాలని రైతునేస్తం పౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న పౌండేషన్‌లో రైతులకు నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై శిక్షణ సదస్సులో ఆయన పాల్గొన్నారు. పాల పుట్టగొడుగుల పెంపకం విధానాన్ని పెంపకం దారు జ్యోతి వివరించారు. తేనేటీగల వలన పంటలలో జరిగే ప్రయోజనాలు స్వయం ఉపాధి మార్గంగా తేనేటీగల పెంపకానికి సంబంధించిన వివరాలను తేనేటీగల పెంపకం దారు చలపతిరావు, జామ సాగులో ఎదురయ్యే ప్రధాన సమస్య నెమటోడ్స్ పరిష్కారానికి సేంద్రియ సాగే సరైన మార్గమని తాను సాగు చేసే పద్ధతులను సేంద్రియ రైతు శబరీనాథ్ వివరించారు.

ఈల పాట రఘురామయ్యకు ఘన నివాళి

సుద్దపల్లి(చేబ్రోలు): ఈల పాట ద్వారా ప్రజల మన్ననలు పొందిన రఘురామయ్య అందరికి ఆదర్శనీయమని ఈలపాట రఘురామయ్య కమిటీ అధ్యక్షుడు కల్యాణం సత్యనారాయణ అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో సోమవారం ఆయన వర్ధంతి నిర్వహించారు. విగ్రహానికి గ్రామస్తులు, పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుద్దపల్లి గ్రామానికి చెందిన కల్యాణం రఘురామయ్య ఈలపాటనే ఇంటిపేరుగా చేసుకున్న గొప్ప కళాకారుడు, వెండితర నటుడుగా రఘురామయ్య ఖ్యాతి గాంచారని నేతలు తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్ నుంచి ఆంధ్రా నైటింగేల్ బిరుదును పొందారన్నారు. ఈలపాట రఘురామయ్య కమిటీ ప్రతినిధులు గోవాడ మోహనరావు, కట్టా బానుమూర్తి, మట్టుపల్లి పోతురాజు, నల్లనూకల రంగారావు, తోట రామాజంనేయులు, సాంబశివరావు పాల్గొన్నారు.



ఈలపాట రఘురామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు

శివారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

లక్ష్మీపురం: అమరజీవి సింహాద్రి శివారెడ్డి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బ్రాడీపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో సింహాద్రి శివారెడ్డి వర్ధంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ శివారెడ్డి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. పార్టీని మితవాద, అతివాద, విచ్ఛిన్న శక్తుల వైపు కొట్టుకుపోకుండా నిలబెట్టారని చెప్పారు. రైతు నాయకుడిగా రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు కొనియాడారు. భూమి లేని పేదలకు భూమి కావాలని ఉద్యమాలు నిర్వహించారని చెప్పారు. తన కుటుంబాన్ని పార్టీ వైపు నిలబెట్టారని, తన జీవిత చరమాంక వరకు పార్టీ ఎదుగుదలకు కృషి చేశారన్నారు. వారి స్ఫూర్తితో ప్రజలెదుర్కొనే సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పార్టీని నిలబెట్టడంలో కీలకంగా పనిచేశారన్నారు. కార్యకర్తల గుర్తించడంలో, వారిని తీర్చిదిద్దడంలో ముఖ్య పాత్ర పోషించేవారన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రభాకర్‌రెడ్డి, వై.కేశవరావు, ఎం.సూర్యారావు, కె.నళీనికాంత్, వై.కష్టకాంత్ పాల్గొన్నారు.



సింహాద్రి శివారెడ్డి చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

చెస్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి వై.సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి 264 మంది క్రీడాకారులు హాజరు కాగా, వారిలో 54 మంది అంతర్జాతీయస్థాయిలో ఆడిన క్రీడాకారులు పాల్గొనడం విశేషమని పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన క్రీడాకారిణి చిన్నం వైష్ణవి ఏడు రౌండ్లు గెలిచి విజేతగా నిలువగా, కె.రవికుమార్ 6.5 పాయింట్లతో ద్వితీయ స్థానం, పల్నాడు జిల్లాకు చెందిన ఎ.వెంకట సాయికృష్ణ తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆనంద్ చెస్ అకాడమీ ఫౌండర్ ఎం.సాంబశివరావు, టోర్నమెంట్ న్యాయనిర్ణేత ఎం.గోపీనాథ్, పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య, ఏవో కె. వెంకట్రావు బహుమతులు అందజేశారు.



చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులతో నిర్వాహకులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పొన్నూరు 9 పోలింగ్ కేంద్రాలు..
7936 మంది ఓటర్లు

పొన్నూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను మండల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందిని ఆదేశించారు.

ఓటర్లను కలుస్తూ..

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరఫున ఆయా పార్టీల నాయకులు, మద్దతుదారులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్య ఓటును తమ అభ్యర్థికే వేయాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు ఇవే..

పొన్నూరు పట్టణంలో నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 4(261, 262,263,264) నంబరు బూత్‌లు, చేబ్రోలు సూర్యదేవర నర్సయ్య ప్రభుత్వ కళాశాలలో 2(265,266), పెదకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3(269,270,271) చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో 600కు పైగా ఓటర్లు ఉంటే అదనపు గదిని ఏర్పాటు చేశారు.



నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లో కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు(ఫైల్)

ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు..

మండలం	పోలింగ్ కేంద్రం	బూత్	పురుషులు	మహిళలు	మొత్తం
పొన్నూరు	జెడ్పీ హైస్కూల్	4	2187	1418	3606
పెదకాకాని	జెడ్పీ హైస్కూల్	3	1561	962	2523
చేబ్రోలు	ఎస్‌డీఎన్ కళాశాల	2	1807		

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాలు.. పెదకాకాని రైల్వే హాల్ట్ సమీపంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లు సోమవారం స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తెలుపు రంగు బన్నీ, నీలి గడుల లుంగీ ధరించి ఉన్నాడు. సుమారు 60 సంవత్సరాలు కలిగిన ఆ మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు కేసు నమోదు చేయడం జరిగిందని రైల్వే సీఐ జి.అంజిబాబు తెలిపారు.

స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి

నెహ్రూ నగర్: స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని, అందులో భాగంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారి ఉత్పత్తులను ఈ-కామర్స్ ప్లాట్ ఫారంలో ఒకే రోజు లక్ష ఉత్పత్తులను అమ్మకం చేయడం ద్వారా గిన్నీస్ రికార్డ్ సాధించడానికి గుంటూరు నగరంలో ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మెప్మా సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా సీఎంఎంలు, సిఓలు, ఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో రానున్న వేసవిలో తాగునీటి సరఫరాలో ఏ సమస్య రాకుండా ఇంజినీరింగ్ అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఉండవల్లి పంపింగ్ హౌస్‌ని పరిశీలించారు. తొలుత ప్రస్తుతం ప్రకాశం బ్యారేజి నీటి నిల్వ, ఉండవల్లి పంపింగ్ కేంద్రం నుంచి ప్రతి రోజు ఎంత నీరు గుంటూరు నగరపాలక సంస్థకు డ్రా చేస్తుంది, మోటార్ల కెపాసిటి, పనితీరు తదితర అంశాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉండవల్లి పంప్ హౌస్, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ దగ్గర ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు లేకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీనివాస్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు నారాయణ రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.



ఉండవల్లి పంప్‌హౌస్‌ని పరిశీలిస్తున్న కమిషనర్

మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు బకాయిలు చెల్లించాలి

నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజు బకాయిలను మార్చి 15వ తేదీ లోగా ఏజెన్సీలు చెల్లించాలని, లేని పక్షంలో సదరు హోర్డింగ్‌లను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం మీడియా ఏజెన్సీలు, పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ చాంబర్‌లో బకాయిల వసూళ్ళపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీలు రెహమాన్, వెంకటేశ్వరరావు, మల్లికార్జున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీ. ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం చండీ హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు 11 మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివ లింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీగణపతి, చండీ హోమాలు చేపట్టారు. పలు రకాల హోమ ద్రవ్యాలతో హోమ పూర్ణాహుతి జరిగింది. అన్నమయ్య కళావేదికపై ప్రముఖ సాహితీవేత్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి మహాభారతంలోని అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.



చండీ హోమంలో రుత్వికులు

సెయింట్ ఆన్స్‌లో కేంద్ర ఎక్సైజ్ సుంకం దినోత్సవం



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ఎక్సైజ్ సుంకం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య మాట్లాడుతూ పరిశ్రమలు, ఇతర వ్యాపార రంగాల్లో అవినీతిని నిరోధించేందుకు కేంద్రం పరోక్ష పన్నుల విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఎగుమతులు, దిగుమతులు, పన్నులపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్ రోజ్, జె.ప్రమీలారాణి, అంజనాదేవి, జీ సరోజ, షేక్ సుభాని పాల్గొన్నారు.